శక్తి యాప్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్: శక్తి యాప్ వినియోగించే విధానం, ప్రయోజనాలు, సమాజంలో జరిగే నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ సిఐ జి శంకర మల్లయ్య అన్నారు. బుధవారం శక్తి టీం బృందాలతో కలిసి వివిధ ప్రయివేటు కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి క్లిష్ట పరిస్థితులు వచ్చినా భయపడకుండా ఎదుర్కొనేలా సిద్ధం కావాలని కోరారు. మహిళలకు ఉపయోగపడే చట్టాలు,వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే శక్తి ఆప్ ప్రయోజనాలు శక్తి టీం జిల్లాలో ఏ విధంగా పనిచేస్తుంది అనే దానిపై వివరించారు. ఆపద వచ్చినప్పుడు మహిళలు తమను తాము రక్షించుకునేందుకు ఉపయోగపడి టోల్ ఫ్రీ నెంబర్ల గురించి తెలియజేశారు. ఎవరైనా సైబర్ నేరాలు, బాల్య వివాహాలకు గురైతే పోలీసులకు సమాచారం అందించాలని అత్యవసర సమయంలో ఉపయోగించాల్సిన నంబర్ల వివరాలను తెలియజేశారు. ప్రస్తుత చట్టాలపై శక్తి యాప్ మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలు, రోడ్డు సేఫ్టీ, మహిళల పట్ల జరిగే నేరాలు వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాయచోటి సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది సాగర్‌రెడ్డి, సురేఖ, పీరమ్మ, ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులు నిబద్ధతతో పనిచేయండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన విజ్ఞప్తులు, భూముల రీ సర్వే, భూమి రికార్డుల శుద్ధి, రికార్డుల అప్డేషన్ తదితర రెవెన్యూ అంశాల్లో అధికారులు నిబద్ధతతో వ్యవహరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. బుధవారం పట్టణంలోని శ్రీ సాయిశుభ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని పలు అంశాలపై కీలక సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అంశాలకు సంబంధించి ప్రజల నుండి స్వీకరించిన విజ్ఞప్తులను నిశితంగా పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విఆర్‌ఒలు, తహశీల్దార్లు, ఆర్‌డిఒలను ఆదేశించారు. రోజూ రెవెన్యూకు సంబంధించిన పనుల్లో కొంత గ్యాప్ కనిపిస్తోందని, సరైన పరిజ్ఞానం లేకపోవడం, తెలుసుకోవాలన్న జిజ్ఞాస లోపించడం వల్ల ఆలస్యాలు జరుగుతున్నాయని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. నూతన మార్పులను క్షుణ్ణంగా అధ్యయనం చేసుకుని త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని ఆయన సూచించారు. పిజిఆర్‌ఎస్ ద్వారా స్వీకరించిన సమస్యల పరిష్కారంపై పలుమార్లు అవగాహన కల్పించినప్పటికీ కొంతమంది విఆర్‌ఒలలో మార్పు కనిపించడం లేదన్నారు. అర్జీలు మన చేతిలో ఉన్నప్పటికీ వాటిని క్షేత్రస్థాయిలో విచారణ జరిపితే సులభంగా పరిష్కార మార్గాలు కనిపిస్తాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ ఒక విఆర్‌ఒను కేటాయించినప్పటికీ గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఇబ్బందులు ఏమిటని కలెక్టర్ ప్రశ్నించారు. జిల్లాలో రీ సర్వే, జాయింట్ ఎల్‌పిఎంల సమస్యలు అనేకం పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో 965 కుటుంబాలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందడం లేదని కలెక్టర్ తెలిపారు. వెబ్ ల్యాండ్ ఆధారం చేసుకుని భూములు ఎవరి పేరుమీద ఉన్నాయో, ఆ భూముల్లో ఎవరున్నారు అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. భూ సమస్యలను సరిగా పరిష్కరించకపోవడం వల్ల పిజిఆర్‌ఎస్‌లో అనేక దరఖాస్తులు వస్తున్నాయని, ఈ అంశంపై సిసిఎల్ఎ కూడా సీరియస్‌గా ఉందని కలెక్టర్ తెలిపారు. కోర్టు వివాదాలు, పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు మినహా ఇతర భూ వివాదాల పరిష్కారంలో అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పకుండా నిబంధనల ప్రకారం నిబద్ధతతో పనులు చేయాలని ఆయన ఆదేశించారు. విఆర్‌ఒలు తమ పనితీరును మెరుగుపరుచుకుని క్షేత్రస్థాయిలో అర్జీదారులను కలిసి పూర్తిస్థాయి విచారణ చేపట్టి సమస్యల పరిష్కారానికి శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. విలేజ్ సర్వేయర్లు, విఆర్‌ఒలు ఎవరి పని వాళ్లు చేసుకుంటూ సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించాలన్నారు. ఇకపై రెవెన్యూ అంశాలపై ఆడిట్ నిర్వహిస్తామని, లోపాలు బయటపడితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. వాగులు, వంకలు, ఇతర ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా వాటిని పరిరక్షించడం రెవెన్యూ అధికారుల బాధ్యత అని ఆయన ఆదేశించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ మెజిస్టీరియల్ పవర్స్, భూమి రికార్డుల శుద్ధి భూ అక్రమణల నివారణ, ప్రజలతో వ్యవహరించే విధానంపై, పాత భూ వివాదాల పరిష్కారం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చి, రికార్డుల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవడం, సమస్యలను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించడంపై దృష్టి సారించే అంశాలపై శిక్షణ నిచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్, డిఆర్‌ఒ మధుసూదన్ రావు, ఆర్‌డిఒ శ్రీనివాస్, మండల తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బ్యాంకుల్లోనే వేతనాలు జమ చేయాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ బ్యాంకుల్లోనే వేతనాలు జమ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. ప్రయివేటు బ్యాంకులో వేతన ఖాతా తెరవాలన్న ఆంక్షలకు నిరసనగా బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పురపాలక కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వేతనాల కొరకు మున్సిపల్ కార్మికులు యాక్సిస్ బ్యాంకులో ఖాతా తెరవాలని ఈ నెల మూడవ తేదీన సర్క్యులర్ జారీ చేశారన్నారు. కార్మిక సంఘాలతో చర్చించకుండా ఇలా ప్రయివేటు బ్యాంకులలో కార్మికులను ఖాతా చేసుకోమని చెప్పడం దారుణం అన్నారు. ప్రస్తుతం ఉన్న బ్యాంకు ఖాతాలలో మున్సిపల్ కార్మికులకు పిఎఫ్ జమ అవుతోందని, ఇప్పుడు బ్యాంకు ఖాతా మార్చడం వలన పిఎఫ్‌కు బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. రాజంపేట పురపాలికలో 25 మంది బదిలీ వర్కర్లు పనిచేస్తున్నారని, వారికి మూడు నెలల నుండి వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కమిషనర్‌ను పలుమార్లు కలిసి విన్నవించినా పరిష్కారం కావడం లేదని ఆవేదన చెందారు. ప్రయివేట్ బ్యాంకులో ఖాతా నిర్ణయం ఉపసంహరించుకోవాలని, కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, ప్రసాద్, ఎం.రమణ, పండు, రవిశంకర్, ఓబయ్య పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం : వైసిపి

క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని మదనపల్లె నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని ఒకటో వార్డులో కౌన్సిలర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిస్సార్ అహమ్మద్ తోపాటు మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి, ఎపిఎండిసి మాజీ చైర్‌పర్సన్ షమీం అస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేసి, కక్ష్య సాధింపు చర్యలకు దిగుతోందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డిని లిక్కర్ స్కాంలో అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. కూటమి నాయకుల దాడులు, దౌర్జన్యాలు తారాస్థాయికి చేరాయని, శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించి పోయాయన్నారు. నిబంధనల పేరిట సూపర్ సిక్స్ పథకాలలో కోత విధిస్తోందని, ఇటీవల చాలామంది దివ్యాంగులకు పింఛన్లను తొలగించారని విమర్శించారు. వారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పాలనకు తూట్లు పొడుస్తూ ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రజాదరణ పెరుగుతోందని, మంగళవారం రాజంపేటకు విచ్చేసిన సందర్భంగా అనూహ్య రీతిలో ప్రజలు తరలివచ్చి జగనన్నపై తమ అభిమానాన్ని చాటుకున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా 2029లో జగన్మోహన్‌రెడ్డి ఎపికి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న మోసపూరిత విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అనంత మునిశేఖర్, నరీ బాబాయ్, శంకర్‌రెడ్డి, సిద్దేశ్వర్, సాంబశివ, శ్రీరాములు, నారాయణ స్వామి, జగన్, చలపతి, ఇడగొట్టి మల్లికార్జున, ముక్కుంట్ల జగదీష్, కొత్తపల్లె మహేష్ బాబు, చిప్పిలి మల్లికార్జునరెడ్డి, శారద, వినూతాభాయి, నాగమణి, మంజుల పాల్గొన్నారు.

విద్యార్థులతో స్నేహభావంగా మెలగాలి : ఎఎస్‌పి

సమావేశంలో మాట్లాడుతున్న ఎఎస్‌పి వెంకటాద్రి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సీనియర్లు జూనియర్ విద్యార్థులతో స్నేహభావంగా మెలిగి ర్యాగింగ్ రహిత వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నమయ్య జిల్లా అదనపు ఎస్‌పి ఎం.వెంకటాద్రి అన్నారు. బుధవారం శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ గ్రాడ్యుయేట్ కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్లతో స్నేహ భావంగా మెలకాలని సూచించారు. ర్యాగింగ్ కార్యక్రమాలకు పాల్పడితే పోలీసులు కేసు నమోదు చేస్తారని, ఫలితంగా యువత విద్యా, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు శాశ్వతంగా దూరమవుతారని హెచ్చరించారు. క్రమశిక్షణతో చదువుపై శ్రద్ధ కనపరిచి సమాజంలో మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, గుట్కా, పొగాకు, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలు సేవించడం వల్ల బరువు తగ్గడం ఆందోళనకు గురి కావడం, ఏకాగ్రత కోల్పోవడం ఆకలి మందగించడం వంటి దుష్ప్రభావాలను గురవుతారని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. మానసికంగా శారీరకంగా ఇబ్బందులకు గురై కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు బలిఅవుతారని వివరించారు. ర్యాగింగ్ చేసినట్లు రుజువైతే ఆరు నెలల నుండి పది సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా రూ. 5 వలే నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని చెప్పారు. ర్యాగింగ్ మత్తుపదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ర్యాగింగ్ విష సంస్కృతిని ప్రతి విద్యార్థీ బహిష్కరించి క్రమశిక్షణతో విద్యలో ఉత్తమ ఫలితాలను సాధించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని కోరారు. మత్తు పదార్థాల వినియోగ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషిచేసి వీటి వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ వెంకటరమణ, సైన్స్, హ్యూమా నీటిస్ విభాగాధిపతి ఎన్ నాగేంద్ర, ర్యాగింగ్, అబ్యుస్ కన్వీనర్ మురళి, ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి కె. రెడ్డయ్య అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ సభ్యుడు రెడ్డెప్పరెడ్డిని సన్మానిస్తున్న సంఘం నేతలు

ఘనంగా పెన్షనర్ల సంక్షేమ సంఘ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె: ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని మదనపల్లి విభాగానికి చెందిన బిఎస్ఎన్ఎల్ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు బుధవారం మదనపల్లి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ప్రాంగణంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని సంఘ కార్యదర్శి షేక్ మహమ్మద్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు రత్నవేణి సంఘ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంఘ సీనియర్ సభ్యుడు రెడ్డెప్పరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సౌందర్ రాజన్, సహాయక కార్యదర్శి గుర్రప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామచంద్రయ్య, సభ్యులు రామచంద్ర, వెంకటరమణ, రెడ్డెప్ప, మునికృష్ణ, మల్లికార్జున, శివశంకర్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు. సందర్భంగా జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందని, ముఖ్యంగా పెన్షన్ సవరణ, తిరుపతిలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సిజిఎచ్ఎస్) వెల్నెస్ కేంద్రం ఏర్పాటు వంటి సమస్యలపై పోరాటం కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు.

11, 12వ తేదీలలో కళా ఉత్సవ్ పోటీలు : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి: ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా స్థాయి కళా ఉత్సవ్-2025 పోటీలు సెప్టెంబర్ 11, 12వ తేదీలలో రాయచోటి డైట్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు డిఇఒ సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం డైట్‌లో కళా ఉత్సవ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్యకళలు, సాంప్రదాయ కథ చెప్పడం వంటి విభాగాలలో విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, కళారూపాలను ప్రోత్సహించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు. పోటీలను వ్యక్తిగత, బృందవిభాగాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన ఇతర వివరాల కోసం జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి 9440246825ను సంప్రదించవచ్చుని తెలిపారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు తిరుపతి శ్రీనివాస్, శివ భాస్కర్, వెంకట సుబ్బారెడ్డి, గిరిబాబు యాదవ్, కేదార్నాథ్, శివప్రసాద్, కలీముల్లా, మోహన్ నాయక్ పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

29 నుంచి ఐటిఐలో అడ్మిషన్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐలో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు మూడవ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు జిల్లా కన్వీనర్, రాజంపేట ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ సి.రామమూర్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ లోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అంతర్జాలంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా తమకు దగ్గరలోని ప్రభుత్వ ఐటిఐలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని, అలా చేయించుకున్న వారి పేర్లు మాత్రమే మెరిట్ లిస్ట్‌లో వస్తాయని, మెరిట్ లిస్ట్ అభ్యర్థులకు ప్రభుత్వ ఐటిఐలో 29, 31వ తేదీల్లో ప్రయివేటు ఐటిఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

23న మదనపల్లెలో బౌద్ధ సమ్మేళనం

ప్రజాశక్తి-పీలేరు: మదనపల్లి బుద్ధుని కొండలో ఈనెల 23న జరిగే బౌద్ధ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. బుధవారం బాస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23న భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో మదనపల్లి బుద్ధుని కొండలో నూతన బుద్ధుని విగ్రహాన్ని పునఃప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విసికె పార్టీ జాతీయ అధ్యక్షులు చిదంబరం పార్లమెంట్ సభ్యులు తోల్ తిరుమావలవన్‌తో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి బహుజన నాయకులు, బౌద్ధ బిక్షువులు హాజరవుతున్నారని తెలిపారు. బౌద్ధ సమ్మేళన కార్యక్రమానికి బుద్ధిస్టులు, కుల సంఘ నాయకులు, అంబేద్కర్ వాదులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయవలని కోరారు.

అవార్డు గ్రహీత మణికుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: ఉత్తమ పంచాయతీ సెక్రటరీగా అవార్డు అందుకున్న కురవంక గ్రామ పంచాయతీ సెక్రటరీ సి.మణి కుమార్‌ను బుధవారం నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 1వ వార్డు మెంబర్, సొసైటీ ప్రధాన కార్యదర్శి జి. కృష్ణమూర్తి అధ్యక్షతన స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ పసుపులేటి చలపతి, కృష్ణమూర్తి దుశ్శాలువా, పుష్పగుచ్ఛం, పూలమాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చలపతి, కృష్ణమూర్తి మాట్లాడుతూ విశిష్ట సేవలు అందించినందుకు ఉత్తమ పంచాయతీ సెక్రటరీగా కలెక్టర్ మణికుమార్ అవార్డు, ప్రసంసా పత్రం అందుకోవడం పట్ల అభినందనలు తెలిపారు. పంచాయతీ పరిధిలో మరింత బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ఆవిష్కాంధ్ర ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఆవిష్కాంధ్ర ప్రారంభోత్సవం నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళగిరి నుండి వర్చువల్‌గా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించారన్నారు. కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, కళాశాల ప్రెసిడెంట్ ఎం.నాగమల్లారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి ఇన్నోవేషన్ యొక్క ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు స్టార్టప్‌ల ప్రాధాన్యతను వివరించారు. ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల నుండి 400 మంది విద్యార్థులు, 8 మంది ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్స్ వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు.

నిస్సార్ మృతి బాధాకరం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్: పట్టణంలోని కొత్తపల్లిలో నివాసం ఉంటున్న కౌన్సిలర్ రియాజ్ సోదరుడు సయ్యద్ నిసార్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మైనార్టీ జిల్లా అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్ కౌన్సిలర్లు షబ్బీర్, శ్యామ్‌తో పాటు భూక్తియార్, జబీబుల్లాఖాన్, షఫిలతో కలిసి నిస్సార్ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సంబేపల్లి ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదంలో తీవ్రమైన గాయపడి 25 రోజులు వైద్యం పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వారు తెలియజేశారు.

జెండాను ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ లక్ష్మీనరసయ్య

దోమల నివారణతో మలేరియా దూరం : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

దోమలను పూర్తిస్థాయిలో నియంత్రించడం ద్వారానే మలేరియాకు చెక్ పెట్టవచ్చునని డిఎంఅండ్‌హెచ్‌ఒ లక్ష్మీనరసయ్య, జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాయచోటిలో ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని శివనర్సింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 1897లో సర్ రోనాల్డ్‌రోస్ అనే బ్రిటీష వైద్యుడు మలేరియా వ్యాధి ఆడఫినాలిసిస్ దోమ ద్వారా వ్యాప్తి చెందుతుందని కనుగొన్నాడన్నారు. ఈ ఆవిష్కరణకు గాను 1902లో సర్ రోనాల్డ్‌రాస్‌కు నోబెల్ బహుమతి దక్కిందంటూ చెప్పారు. దోమలో మలేరియా పరాన్నజీవిని కనిపెట్టిన రోజు ఆగస్టు 20 కాబట్టి ఆరోజున ప్రతియేటా ప్రపంచ దోమల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నట్లు వివరించారు. కీలకాల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను నియంత్రణ చేయడంలో మానవాళికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు రోనాల్డ్‌రాస్ అన్నారు. అనంతరం పట్టణంలోని మాసాపేట వీధులలో విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని వారు జెండాఊపి ప్రారంభించారు. పిల్లల చేత దోమలనివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ భాస్కర్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్స్ మహమ్మద్‌రఫీ, బలరామరాజు, సబ్‌యూనిట్ అధికారి జయరాం, ఎంపిహెచ్‌ఒ శ్రీనివాసులు నాయక్, ఎల్‌టి శివతో పాటు హెల్త్ అసిస్టెంట్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐటియు నాయకులు రామాంజులుకు పితృవియోగం

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

సిఐటియు అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు తండ్రి అబ్బవరం వెంకట్రమణ బుధవారం మృతి చెందారు. మూడు సంవత్సరాల క్రితం జరిగిన ప్రమాదంలో వెన్నెముక దెబ్బతింది. అప్పటి నుంచి ఆయన మంచానికి పరిమితమై ఉన్నారు. మంగళవారం శ్వాస సమస్య ఎర్పడటంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 11 గంటలకు మరణించారు. వెంకట్రమణకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిల్లలకు అందరికీ వివాహాలయ్యాయి. పెద్దకుమారుడు మధు ప్రయివేటు కళాశాలలో పనిచేస్తున్నారు. రెండవ కుమారుడు రామాంజులు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. వెంకట్రమణ మరణ వార్త దిగ్భ్రాంతి కలిగించిందని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. అబ్బవరంలో వెంకటరమణ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రామాంజులు కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతిని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు రాష్ట్ర కమిటి తరపున సంతాపం ప్రకటించారు. కడప జిల్లా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామ్మోహన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, సిఐటియు అన్నమయ్య జిల్లా కోశాధికారి హరిశర్మ, ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి, భాగ్యలక్ష్మి, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి మెహరాజ్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు హరిప్రసాద్, జాబిర్ తదితరులు నివాళి అర్పించి సంతాపం తెలిపారు. రాయచోటి పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శివగంగరెడ్డి, సందీప్ స్కూల్ కరస్పాండెంట్ జగన్మోహన్‌రెడ్డి వెంకట్రామిరెడ్డి, వీరభద్ర జూనియర్ కళాశాల అధ్యాపకులు, సిపిఐ పట్టణ కార్యదర్శి సిద్దిగాల్ల శ్రీనివాసులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.



వెంకటరమణ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఉమ్మడి జిల్లా సిపిఎం నాయకులు

ప్రజా అవసరాలు గుర్తెరిగి విధులు నిర్వర్తించాలి

చికెన్ సెంటర్లలో అపరిశుభ్రతను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవి

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

ప్రజావసరాలను గుర్తెరిగి వాటికనుగుణంగా మున్సిపల్ సచివాలయం ఉద్యోగులు విధులను నిర్వర్తించాలని మున్సిపల్ కమిషనర్ జి.రవి అన్నారు. బుధవారం ఆయన మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని ఉద్యోగుల అటెండెన్స్, మూవ్‌మెంట్, గ్రీవెన్స్ తదితర రిజిస్టర్‌లను పరిశీలించారు. కార్యదర్శులతో మాట్లాడుతూ విధినిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన పురవీధులలో పారిశుధ్య కార్మికులు నిర్వర్తిస్తున్న విధులను పరిశీలించారు. పట్టణంలోని పలు చికెన్ సెంటర్లు, హోటళ్లు, దుకాణాల ముందు ఉన్న అపరిశుభ్రతను గుర్తించి వాటి యజమానులపై ఆగ్రహించారు. పరిశుభ్రతను పాటించకపోతే కఠినచర్యలు తప్పవంటూ హెచ్చరించారు. నిర్దేశించిన ప్రమాణాలు లేని ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే సహించబోమన్నారు. మరోమారు ప్లాస్టిక్ సంచులను విక్రయిస్తే జరిమానాలు విధిస్తామని, కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో పలువురు కార్యదర్శులతో సమావేశమై పట్టణ పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలంటూ సూచించారు. రోడ్లపై విచ్చలవిడిగా పశువులు తిరగడం, రోడ్లపైనే పడుకోవడం తదితరాల కారణంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోందన్నారు. కొన్ని ప్రమాదాలు కూడా జరుగుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రోజుల పాటు యజమానులు తమ పశువులను పట్టణం వెలుపలికి తరలించాలంటూ కోరారు. లేని పక్షంలో మున్సిపల్ సిబ్బంది ద్వారా పశువులను పట్టుకుని గోశాలకు తరలిస్తామంటూ ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు రోడ్ల కూడలిలో.. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-కలికిరి

తిరుపతి-అనంతపురం జాతీయ రహదారిలోని కలికిరి నాలుగు రోడ్ల కూడలిలో సర్వీస్‌రోడ్డు ఏర్పాటు చేయాలని సర్వసభ్య సమావేశంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రం కలికిరిలోని స్థానిక ఎంపిడిఒ సమావేశ భవనంలో ఎంపిపి నూర్జహాన్ అధ్యక్షతన ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు తిరుపతి-అనంతపురం హైవే లోని తానా మిట్ట మీద ఉన్న నాలుగు రోడ్ల కూడలిలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి తిరుపతి, మదనపల్లి వైపు నుంచి కలికిరికి వచ్చే వాహనాలకు, ఆర్‌టిసి ప్రయాణికులకు తలెత్తుతున్న ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నాలుగు లైన్ల రహదారిలో తిరుపతి వైపు నుంచి కలికిరి వచ్చే టప్పుడు బెస్తపల్లి వద్ద, మదనపల్లి వైపు నుంచి వచ్చేటప్పుడు టేకుల కోన వద్ద సర్వీస్ రోడ్డులోకి వస్తే మధ్యలో ఎక్కడా కూడా హైవే రోడ్లో నుంచి సర్వీస్ రోడ్డులోకి లింక్ రోడ్డు లేకపోవడంతో ఆర్‌టిసి బస్సులు కలికిరికి రాకుండా హైవేపైన మదనపల్లి, తిరుపతికి వెళ్లిపోతుండడంతో తిరుపతి, మదనపల్లి నుంచి కలికిరికి రావలసిన ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రాత్రి 7గంటలు దాటితే తిరుపతి, మదనపల్లి ఆర్‌టిసి బస్సులు కూడా కలికిరికి రాకుం డా హైవేపైన వెళుతుండడంతో స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు కూడా ఆర్డినరీ బస్సు లు కోసం గంటల కొద్ది నిరీక్షణ చేసి ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సమావేశానికి విచ్చేసిన ఆర్ అండ్‌బి, పీలేరు ఆర్‌టిసిడిపో అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించడానికి ఉన్నతాధికారులతో చర్చించా లని ఆదేశించారు. సభ్యులు ఇచ్చిన డిమాండ్లను ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని తెలిపారు.

సర్వీస్‌రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న సభ్యులు

దోమలను నివారిద్దాం..ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

లక్కిరెడ్డిపల్లి : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - నందలూరు

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మండలంలో డాక్టర్ శరత్‌కమల్ ఆధ్వ ర్యంలో విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఇంటర్ విద్యార్థులకు సమావేశం ఏర్పాటు చేసి దోమల వలన వచ్చు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటనారాయణ, సబ్‌యూనిట్ ఆఫీసర్ ఎస్ఎస్.దాస్ మాట్లాడుతూ దోమలు చాలా రకాలు ఉన్నాయని, మన ప్రాంతంలో ఎడిస్ ఈజిప్టి దోమలు మంచి నీటిలో పెరుగుతా యన్నారు. ఇవి కుట్టడం వలన డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు వస్తాయని తెలిపారు. ఏనాఫిలిస్ దోమలు కూడా మంచి నీటిలో పెరుగతాయి వీటి వలన మలేరియా వ్యాధులు వస్తాయని అన్నారు. క్యూలెక్స్ దోమలు మురికి నీటిలో పెరుగతాయి వీటి వలన బోధకాలు, మెదడువాపు జ్వరాలు వస్తాయని తెలిపారు. ప్రజలందరూ మన ఇంటిలో వాడుకొనే తొట్టిలో నీటిని వారానికి ఒక సారి శుభ్రంగా కడిగి మళ్ళీ శుద్ధమైన నీటిని పట్టుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి బయట పాత టైర్స్, పాత కుండలు, వాడని రోళ్లలో వర్షం నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా రాత్రిలో దోమ తెరలు వాడాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **రామాపురం :** వారంలో వారం ఒకరోజు డ్రైడే పాటిద్దాం దోమల నివారణకు సహకరిద్దామని సబ్ యూనిట్ అధికారి జి.జయరా మయ్య పిలుపు నిచ్చారు. మండలంలోని గువ్వలచెరువు యుపిపి పాఠ శాలలో బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ దోమ కాటుకు గురి కాకుండా ప్రతి ఇంటిలో ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. దోమలు వృద్ధి కాకుండా వారంలో ఒకరోజు డ్రైనేజీ పాడించి నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉన్న గుంతల్లో వేస్ట్ ఆయిల్ డీజిల్ కిరోసిన్ చల్లడం వల్ల దోమల వృద్ధిని అరికట్టవచ్చని అన్నారు. కార్యక్ర మంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రేఖనాయక్, హెల్త్ అసిస్టెంట్లు క్రిస్ట ఫర్, ఓబులేసు పాఠశాల ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే దోమలను నివారించవచ్చని మలేరియా సభ్యునిగా ఆఫీసర్ జయరామయ్య పేర్కొన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా లక్కిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. దోమ నివారణకు ప్రతి ఒక్కరూ దోమతెరలు ఉపయోగించాలన్నారు. ఇంటిలోకి కిటకీలకు మెస్ కొంట్టించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ దేవదానం, సూపర్ వైజర్ మనీ, హెల్త్ అసిస్టెంట్ రాజేం ద్రప్రసాద్, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి:** దోమల వ్యాప్తి అరికడితేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పిహెచ్‌సి వైద్యులు ప్రసన్న లక్ష్మీ వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఎఎస్ ఆర్ కాలనీలో మేడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న, కమ్యూనిటీ వైద్యశాల వైద్యాధి కారులు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో మేడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఎఎన్ఎం లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశాలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ముజీబ్‌బాషా, సిహెచ్ఒ శాంతి, సూపర్‌వైజర్లు సుధాకర్, గిరిజ, హెల్త్ అసిస్టెంట్ లు షఫీ, జగన్ పాల్గొన్నారు.

నాగయ్యను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

డిప్యూటీ డిఇఒ నాగయ్యకు ఘనసత్కారం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలో డిఇఒకు విధులు నిర్వహిస్తూ ఇటీవల రాయచోటి డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఒగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన లంకాయగారి నాగయ్యను బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక నాగిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో పాధ్యాయులు, బోధన బోధనేతర సిబ్బంది ఆయనకు శాలువా కప్పి, పూలమాలవేసి ఘన సత్కారం చేశారు. ఉప విద్యాశాఖ అధికారిగా పాఠశాల విద్యాశాఖకు గొప్ప పేరు వచ్చేలా చేసి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించేలా కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 అనంతకృష్ణ, ఉపాధ్యాయులు గ్లోరీకిరణ్ ఉజాల, నాగిశెట్టి లక్ష్మీనారాయణ, బోగా వెంకటసుబ్బయ్య, శిల్పి ఆనందాచారి, గీత, జ్యోతి ప్రియ, ఆర్‌వి రమణమ్మ, పి.విజయకుమారి, గౌరీ, మస్తాన్, గాయత్రీ దేవి పాల్గొన్నారు.

బాధితుడికి పింఛను మంజూరు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-రామాపురం : 'తలసేమియా బాధితుడికి ఆర్థిక సాయం' అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు కలెక్టర్ శ్రీధర్ చామకూరి స్పందించారు. శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో షకిల్ అహ్మద్‌కు పింఛన్ మంజూరుకు సిఫారసు చేశారు. బుధవారం ఐసిడిఎస్, సచివాలయ సిబ్బంది బాధితుడి స్వగృహం వద్ద వెళ్లి పింఛన్ మంజూరుకు కావాల్సిన ధ్రుపత్రాలను పరిశీలించారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు : స్త్రీ శక్తి పథకం ద్వారా ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలని బిస్మిల్లాఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బోదేషావలి తెలిపారు. బుధవారం ఆయన పీలేరులో ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉందని అన్నారు. ఆటోలను నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు బ్రతుకు భారంగా మారు తోందని, ఫలితంగా ఆటోలను అమ్ముకుని బ్రతికే పరిస్థితి ఆసన్నమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రమనాయక్, సయ్యద్, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

- కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి

వర్షాకాలంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చునని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల సూచించారు. ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలకు రైతులకు సలహాలు ఇవ్వడం కొరకు కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి శాస్త్రవేత్తలు డాక్టర్ సి.హెచ్. భార్గవ రామిరెడ్డి, డాక్టర్ సహదేవ, జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయ అధికారి పి.రామకృష్ణరాజు రెండు రోజుల మండలంలోని మర్రికుంటపల్లి, మేడికుర్తి, కె.విపల్లి మండలంలోని తిమ్మాపురం, పీలేరు మండలంలోని జంగంపల్లిలో వరి, టమోటా, బొప్పాయి పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ప్రస్తుతం వరిలో జీవన ఎరువులు వినియోగించాలన్నారు. వేరుశనగ పంటలో మొవ్వ కుళ్లు, కాండంకుళ్ళు వైరస్ తెగులు గమనించి మొక్కల్ని పీకికాల్చి వేయాలని సూచించారు. ఆకుల చివర్లు పసుపు రంగులోకి మారడం పచ్చ దోమ ద్వారా కలిగిందని, అదుపులో ఉందనీ, తీవ్రత పెరిగితే నివారణగా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. వయ్యారిభామ కలుపు మొక్కలను తీసి వేసి కాల్చివేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ హేమలత, మర్రికుంటపల్లి గ్రామ సహాయ వ్యవసాయ అధికారి, రైతులు పాల్గొన్నారు.

బొప్పాయి పంటను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

వెనకపడ్డ విద్యార్థులను దత్తత తీసుకోవాలి : ఎంఇఒ

విద్యారుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ కుమార్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

చదువులు వెనుకబడిన విద్యార్థులను ప్రతి ఉపాధ్యాయుడు దత్తతు తీసుకొని వారినీ తీర్చిదిద్దాలని అసిస్టెంట్ అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ పివిఎన్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లిలోని ఎపి మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వం అందించిన హ్యాండ్స్ బుక్స్ ను ఫాలోఫ్ అయ్యి విద్యార్థులకు బోధించాలన్నారు. ప్రయివేట్ పాఠశాలలు దీటుగా ప్రభుత్వ పాఠ శాలలో మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎన్ఎంఎం పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించి అందరూ మెరిట్ స్కాలర్‌షిప్ సాధించాలన్నారు. అనంతరం డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొ న్నారు. **రామాపురం :** మండలంలోని స్థానిక ఆదర్శ పాఠశాలను అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పివిఎన్. కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన టీచింగ్, నాన్- టీచింగ్ సిబ్బంది ఇన్ టైమ్ అవుట్ టైమ్ హాజరు, విద్యార్థుల హాజరు, తరగతి గదులు, విద్యార్థులు అభ్యసన సామర్థ్యాల పరిశీలించారు. ఉపాధ్యాయులుతో ముఖాముఖీ, విద్యాశక్తి క్లాసుల పనితీరు, ఎంసెట్, జెఇఇ, నీట్ తరగతుల నిర్వహణ, ఎన్ ఎంఎస్ఎస్ క్లాసుల నిర్వహన గురించి సమీక్షిం చారు. ఉపాధ్యాయులతో సమా వేశం నిర్వహించి విద్యార్థుల నమోదు శాతం, హాజరు శాతం, వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు. పాఠశాల మధ్యాహ్న భోజ నం, పాఠశాల వసతిగృహ పరిశీలన చేశారు. వంటగదులు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రం తంబళ్లపల్లిలోని మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి మహమ్మద్‌అజహర్ జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ లత, ప్రిన్సిపల్ హేమంత్ కుమార్ తెలిపారు. ఎపి షూటింగ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ పరశురాముడు, జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కన్వీనర్ సురేష్‌బాబు, కార్యదర్శి గౌతమి నుంచి ఎంపిక ఉత్తర్వులు వచ్చినట్టు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల 25, 26 తేదీలలో మదనపల్లిలోని వశిష్ఠ స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో విద్యార్థి అజహర్ జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ చూపాడన్నారు. సెలెక్టర్లు అజహర్ ను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు చెప్పారు. బీహార్‌లోని బుద్ధ గయాలో జరిగే 44వ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో అజహర్ పాల్గొంటాడని ప్రిన్సిపల్, పీడీ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అజహర్‌ను ఎంఇఒలు త్యాగరాజు, నాగ సుబ్బారాయుడు, ప్రిన్సిపల్, పీడీ, ఎస్ఎంసి చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

అసంపూర్తి గృహాలను పూర్తి చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో గృహ నిర్మాణశాఖ ద్వారా మంజూరైన గృహాలు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయని వెంటనే వాటి నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేయాలని ఎంపిడిఒ రమేష్‌బాబు అన్నారు. బుధవారం రాచవేటివారిపల్లె గ్రామంలో హౌసింగ్ ఎఇ అమర్నాథ్, ఇంజినీరింగ్ సహాయకులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా మంజూరై వివిధ దశల్లో ఇంకా అసంపూర్తిగా ఉన్న గృహాలను ఆయన సందర్శించారు. గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు. పక్కా గృహ నిర్మాణాలకు అందిస్తున్న రూ.1.80 లక్షలకు అదనంగా మరో రూ.50 వేల నుంచి రూ.75 వేలు ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. అయినా ఇప్పటికీ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తి చేయలేదన్నారు. హౌసింగ్ అధికారులు, ఇంజి నీరింగ్ అసిస్టెంట్లు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేయించాలని పేర్కొన్నారు. హౌసింగ్ పురోగతిపై ప్రతివారం సమీక్షిస్తామని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న అదనపు సాయాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం రాచవేటివారిపల్లె గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. స్వామిత్వ సర్వేను వేగంగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ సర్వే ద్వారా ఆర్థిక స్థితిగతులను మెరుగు పరుచుకోవచ్చుని, పేదల భూ రికార్డులలోని వివాదాలను తగ్గించడానికి వీలవుతుందన్నారు. పక్కా ప్రణాళి కలతో ఆదాయ సమీకరణలను క్రమబద్ధీకరిం చవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ అమ ర్నాథ్, పంచాయతీ కార్యదర్శి రజిత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వరప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రమేష్‌బబు

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వినాయక చవితి సందర్భంగా విగ్రహాలను, మండపాలను ఏర్పాటు చేయడానికి పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినాయక చవితి ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహించి మండపాల ఏర్పాట్లు చేసుకోవడానికి పోలీసు, పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మండలంలో వినాయక చవితి మండపాలను ఏర్పాటు చేస్తున్న కమిటీ సభ్యుల పూర్తి వివరాలను పోలీసులు స్టేషనుకు అందజేయాలన్నారు. పబ్లిక్, ప్రైవేట్ స్థలాల్లో వేడుకలు చేసుకునే వారు తప్పనిసరిగా ఆయా విభాగపు అధికారులు, సంస్థల యజమానుల అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక ప్రతిమల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, మార్గం, నిమజ్జనానికి వినియోగించే వాహనం వివరాలను విధిగా తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వినాయక చవితి సందర్భంగా పండుగను భక్తి భావంతో శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. **కలికిరి:** వినాయక విగ్రహాల ఏర్పాటుకు విగ్రహాలు ఏర్పాటు చేసే గ్రామస్తులు, వినాయక కమిటీలు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని సిఐ అనిల్ కుమార్ స్పష్టం చేశారు. వినాయక ఉత్సవాల సందర్భంగా మండలంలోని గుండ్లూరు మహల్ కొత్తపల్లి పారిపట్ల చీకటిపల్లి రంగనాథపురం గ్రామాలలో సందర్శించి వినాయకచవితి పండుగ సందర్భంగా వినాయక మండపాలు ఏర్పాటు చేసే ప్రదేశాలను నిమజ్జనం చేసే ప్రదేశాలను పరిశీలించి కమిటీ సభ్యులకు పన్ను సూచనలు సలహాలు ఇచ్చారు. వినాయక చవితి పండుగను శాంతియుతంగా ఆనందంగా జరుపుకోవాలని, విగ్రహాల మండపం దగ్గర, విద్యుత్ వైర్లు వద్ద అగ్ని ప్రమాదం జరగకుండా కమిటీ బాధ్యత వహించాలని, కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ వినాయక మండపాల వద్ద రాత్రి సమయంలో అక్కడే నిద్రించాలని అన్నారు. నిమజ్జనం సమయంలో మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనరాదని తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహశీల్దార్ అమర్నాథ్, ఎంఇఒ-2 సుందంబాబు పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో గల క్యాంపస్ ప్రాథ:మిక పాఠశాలను వారు తనిఖీచేశారు. మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని వారు పరిశీలించి, భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి ఆరా తీశారు. విద్యార్థు లకు సకాలంలో భోజనం వడ్డించాలని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు జయకృష్ణ, వేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎఇ రాజేందర్‌కు సన్మానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక నగర పంచాయతీ ఎఇ రాజేందర్ హిందూపురం మున్సిపాలిటీ ఎఇగా బదిలీ అయ్యారు. బుధవారం నగర పంచాయతీ కమిషనర్ జివి. పల్లవి, మేనేజర్ టి.రాములు ఆధ్వర్యంలో శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజేందర్ వృత్తి పట్ల ఎంతో నిబద్ధతతో పనిచేసేవారన్నారు. తోటి అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి నగర పంచాయతీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఇక్కడ నుండి ఆయన బదిలీ అవడం కొంత ఇబ్బందికరమే అయినప్పటికీ,ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు సర్వసాధారణమేనన్నారు. ఆయనకు భవి ష్యత్తులో మరిన్ని పదోన్నతలు లభించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగరపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి శిక్షణ కార్యశాలకు ఎంపికైన ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి-చిట్వేలి

శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధనా మండలి వారు జిగ్యాస కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా 30 మంది ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు ముఖాముఖి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిట్వేలి జడ్‌పి హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఎ.శివన్నారాయణ గౌడ్ బెంగళూరులోని జాతీయ వైమానిక అంతరిక్ష ప్రయోగశాలలో ఏరో డైనమిక్స్ విమాన విడిభాగాలు, నానో మెటీరియల్స్‌లపైన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ జిగ్యాస మోడల్ అధికారి డాక్టర్ వి.పి.ఎస్.నాయుడు ద్వారా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ఉపాధ్యాయ సిబ్బంది శివన్నారాయణ గౌడ్‌ను అభినందించారు.

'మిట్స్'లో ఎఐ ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

అంగళ్లు సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో హైదరాబాద్‌కు చెందిన స్టూడెంట్ ట్రైబ్ కంపెనీ సిఇఒ చరణ్ లక్కరాజు బుధవారం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి అవసరమైన అంశాలను వివరించారు. ప్రస్తుత పరిశ్రమల్లో వేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యతను వివరించి, ప్రతి విషయాన్నీ సీరియస్‌గా కాకుండా క్లుప్తంగా వినడం, అర్థం చేసుకోవడం ద్వారా మానసిక విస్త ృతి పెరుగుతుందని అన్నారు. జనరేటివ్ ప్రీ-ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్ (జిపిటి) టెక్నాలజీపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ప్రతి మూడు నెలలకు కొత్త టెక్నాలజీలు వస్తున్నాయని, వాటిపై విద్యార్థులు కచ్చితంగా దృష్టి సారించాలన్నారు. ఇంజినీరింగ్ చదివితే సరిపోదు, అదనంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, బ్లాక్‌చెయిన్, రోబోటిక్స్ వంటి కోర్సు లను నేర్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కేవలం డిగ్రీపై కాకుండా, టెక్నాలజీ అవగాహనపై దృష్టి పెడితేనే మంచి స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా, రాయచోటి టౌన్, మండలం అలిమాబాద్ వీది, డోర్ నెం.31/9 లో నివాసం ఉంటున్న షేక్.ఖాజాబీ భర్త కొలిమి జాబీవుల్లాకు చెందిన ఒరిజనల్ పాస్‌పోర్ట్ ఈ నెల 10వ తేదీన రాయచోటి అర్‌టిసి బస్టాండ్ ప్రాంతంలో నాకు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ **S7098522** పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గాని 8919392791 మొబైల్ నెంబర్‌కు గాని తెలుపగలరు.

క్రైం కార్నర్

రెండు గ్రూపుల మధ్య ఘర్షణ

- ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెంచుపాడు గ్రామం, బొంగువారిపల్లికి చెందిన పాపులమ్మ సాగు చేసిన వరి పైరును ఆవులు మేసాయని దూషించింది. ఆగ్రహించిన దాయాది మునెప్ప తన బంధువులతో కలిసి కర్రలతో పాపులమ్మ, ఆమె బంధువు విజయలక్ష్మి పై దాడిచేశారు. ఎదురు దాడిలో మునెప్ప గ్రూపులోని నందిని అనే మహిళ గాయపడిందన్నారు. రెండు గ్రూపుల్లోని గాయపడిన బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇరు గ్రూపుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మదనపల్లె తాలూకా పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద మృతి.. హత్య కేసుగా మార్పు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వెస్ట్ బెంగాల్ యువకుడి కేసును హత్యకేసుగా మార్పు చేస్తున్నట్లు రైల్వే సిఐ అశోక్ కుమార్ తెలిపారు. మండలంలోని సిటియం గ్రామంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గత మూడు రోజుల క్రితం వెస్ట్ బెంగాల్ చెందినఖదీర్అనే యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు పోస్ట్ మార్టం నివేదిక ఆధారంగా హత్యకేసుగా మార్పు చేశారు. గంజాయి నేపథ్యంలో హత్య జరిగినట్లు తెలుస్తోంది. ఇద్దరు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న టిడిపి సీనియర్ నాయకులు జేసిబి మధుసూధన్‌రెడ్డి వెంటనే స్పందించి బాధితుడిని ఆటోలో స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మదుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కదిరి రోడ్డులోని టిప్పు సుల్తాన్ కాంప్లెక్స్ వద్ద గుర్తుతెలియని యువకుడు నడుచుకుని వెళుతుండగా అటుగా వెళుతున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొని వెళ్లిపోయిందన్నారు. ఈ ప్రమాదంలో యువకుడు కిందపడి తలకు బలమైన దెబ్బ తగలడంతో తీవ్ర రక్తస్రావమై కుప్ప కూలిపోయాడన్నారు. భాధితుడిని వెంటనే ఆటోలో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చామని తెలిపారు. బాధితుడి వివరాలు తెలియలేదని, పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

రైల్వేకోడూరు : విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

మామిడిలో కొమ్మ కత్తిరింపులపై శిక్షణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మామిడికాయ కోతానంతరం మామిడితోటలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై, కొమ్మ కత్తిరింపులపై కలికిరి కెవికె శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసులు తో కలసి రైతులకు అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించినట్లు మదనపల్లి ఉద్యానవనశాఖ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వెంగంవారిపల్లి గ్రామంలో మామిడికాయ కోతనంతరం తీసుకోవలసిన చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉద్యానశాఖ తరపున రైతులకు అందుబాటులో ఉన్న పథకాలైన మామిడి, అల్లనేరేడు, దానిమ్మ, జామ, వంటి పండ్ల తోటల పెంపకంలో రైతులకు సబ్సిడీలు ఉన్నాయని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి రైతులకు మల్చింగ్ పేపర్‌కు, పూల మొక్కలకు, కూరగాయల మొక్కలు నాటిన వాళ్ళకి ఎకరాకు రూ.8 వేలు సబ్సిడీ అందుతుందన్నారు. నీటి నిల్వ కుంటలకు 50 శాతం రాయితీ చొప్పున రూ.75 వేలు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు పాలిహౌస్, షేడ్ నెట్ హౌస్ నిర్మించుకుంటే 50శాతం రాయితీ వర్తిస్తుందని అన్నారు. కలికిరి కెవికె శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసులు మామిడిలో ప్రస్తుతం చేయవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కొమ్మ కత్తిరింపులు, ముదురు చెట్ల పునరుద్ధరణ, తల మార్పిడి విధానంపై, కొత్తగా చెట్లు నాటే రైతులు ట్రైనింగ్, ప్రూనింగ్ చేయవలసిన పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం మామిడిలో కొమ్మ కతరింపులు చేపట్టడానికి అనువైన సమయం అన్నారు. ఎండ చెట్టు కాండం మీద పడేటట్టుగా తల భాగంలో ఉండే కొమ్మలను తీసివేయాలని తెలిపారు. యాజమాన్య పద్ధతులు మామిడి తోటల సాగులో పాటించడం వలన చెట్టు ఆరోగ్యంగా పెరగడమే కాకుండా సకాలంలో పూత రావడానికి దోహదపడుతుందని తద్వారా అధిక దిగుబడలను సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీవాణి నవీన్, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** విత్తన శుద్ధితో రైతులు 20 రోజులపాటు ఎటువంటి శిలీంద్రాలు ఆశించకుండా పంటను కాపాడుకోవచ్చునని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండల ంలోని శెట్టి గుంట పంచాయతీ లక్ష్మీగారిపల్లి గ్రామంలో బుధవారం రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమం సద్ద పంటలో నిర్వహించారు. సద్ద పంటలో విత్తన శుద్ధి,నానో ఎరువుల ఉపయోగం గురించి డెమో నిర్వహిం చారు. అధిక మోతాదులో యూరియా, డిఎపి,ఎంఒపి వాడటం వలన చీడపీడలు అధికంగా ఆశించి రైతుకు నష్టం కలిగిస్తుంది కాబట్టి యూరియాకి బదులు నానో ఎరువులను వాడవల్సిందిగా వ్యవసాయ అధికారి తెలిపారు. కార్యక్ర మంలో వ్యవసాయ అధికారి సందీప్, కోడూరు డివిజన్ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ బాలసుబ్రమణ్యం, శెట్టిగుంట విహెచ్ఎ ఉదయభాను, రైతులు పాల్గొన్నారు.

రైల్వే జిఎంను కలిసిన తల్లెం భరత్

ప్రజాశక్తి-పుల్లంపేట

సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ శ్రీసంజయ్ కుమార్, శ్రీవాస్తవను కడపరైల్వే స్టేషన్‌లో గుంతకల్ రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా భరత్ పలు రైల్వేస్టేషన్ల అభివృద్ధి స్టాపింగ్‌ల గురించి రైల్వే జిఎంకు వినతి పత్రం సమర్పించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటు పరిధిలోని రైల్వేకోడూరు రైల్వేస్టేషన్ రైళ్ల నిలుపుదలకు గురించి వివరించినట్లు తెలిపారు. రాజంపేట లో హరిప్రియ నిలుపుదల, శెట్టిగుంట, పుల్లంపేటలో నంద్యాల డెమో నిలుపుదల, ఓబులవారిపల్లిలో తిరుమల ఎక్స్‌ప్రెస్, రాయలసీమ నిలుపుదల కొరకు, రెడ్డిపల్లి రైల్వే స్టేషన్‌లో ఇంటర్‌సిటి, అరకోణం నిలుపుదలకు విన్నవించినట్లు తెలిపారు. రామయ్య పాలెం ఎల్ 87 గేట్ దగ్గర నీళ్ల తోడేయాలని తదితర అంశాల మీద వినితి ద్వారా జిఎంకు స్పష్టంగా తెలియజేసినట్లు తెలిపారు. ఈ సమస్యలపై జిఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో పల్లపు జనార్ధన పాల్గొన్నారు.

రైల్వే జిఎంకు వినతి పత్రం ఇస్తున్న తల్లెం భరత్

వైభవంగా సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్టాపన

- విద్యార్థులకు ఉచిత బస్సు పాస్‌లు పంపిణీ

విద్యార్థులకు ఉచిత బస్సు పాస్‌లు అందిస్తున్న మద్దిరెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రం తంబళ్లపల్లెలోని మోడల్ స్కూల్‌లో బుధవారం సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి సొంత నిధులతో పాఠశాలలో సరస్వతి ఆలయం నిర్మించారు. బుధవారం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ మద్దిరెడ్డి, పద్మావతమ్మ దంపతులు ప్రిన్సిపల్ హేమంత్ కుమార్, టీచర్లు, విద్యార్థులతో కలసి విగ్రహ ప్రతిష్టాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం మద్దిరెడ్డి సొంత నిధులతో పాఠశాలలో 6,7తరగతులు చదువుతున్న 80 మంది విద్యార్థులకు ఉచితంగా బస్ పాసులు పంపిణీ చేశారు.